క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

చండూరు : మండల పరిధిలోని ఫర్టిలైజర్స్ షాపులను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్లగొండ టీం సభ్యులు మహేష్ గౌస్, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌తో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో పత్తి, వరి విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు పరిశీలించారు. ధరల పట్టిక సరిగ్గా రాయనందుకు పలు దుకాణదారులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ లు ఓ.నిఖిల్, వెంకట్ రెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

వర్షంలో కొనసాగిన దీక్ష



దీక్ష చేస్తున్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని ఆ గ్రామస్తులు చేపట్టిన దీక్ష మంగళవారం వర్షంలో కొనసాగించారు. దీక్షలో ఆ గ్రామంలోని పలువురు వృద్ధులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం భవనం ప్రారంభానికి తరలిరావాలి



వేణుగోపాల్‌రావు

రామగిరి(నల్లగొండ) : బ్రాహ్మణ సంఘం భవన ప్రారంభోత్సవానికి బ్రాహ్మణులంతా తరలిరావాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాల్‌రావు కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా గోపాన్‌పల్లిలో బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణ సంఘం భవనం ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్య సమాజ్ వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గిరిబాబు

చండూరు : బీజేపీ నాయకుడు, చండూరు మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో గిరిబాబు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో, ఆ తర్వాత బీజేపీ చేరారు.

ముదిరాజ్‌లను బీసీ'ఏ'లో చేర్చాలి

చిట్యాల : ముదిరాజ్ కులస్తులను బీసీ 'ఏ' కేటగిరిలో చేర్చాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన ముదిరాజ్ కులస్తుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల వృత్తిదారులకు ఇచ్చే లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ముదిరాజ్ కులస్తులకు వర్తింపజేయాలని కోరారు. ముదిరాజ్ కులస్తులకు ద్విచక్ర వాహనాలు, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. గుడిసె పద్మ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెల్లా చంద్రయ్య, గుడిసె నర్సింహ, జెల్లా పారిజాత, నీలస్వామి, జంగయ్య, మల్లయ్య, లింగస్వామి, ఆంజినేయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వెంకన్న

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో నారగాని వెంకన్నకు మంజూరైన రూ. 60 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేషరాజుపల్లి వెంకన్న, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అల్లి రామ్మోహన్ రాజు, చివ్వట సైదులు, సుల్తాన్ శ్రీనివాస్, మేడిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందేదెప్పుడు

- మార్చి నెలలో పంట నష్టం అంచనా
- సర్వే చేసి నివేదిక అందజేసిన అధికారులు
- నేటికీ అందని పరిహారం
- ఆందోళనలో అన్నదాతలు



సుంకెనెపల్లిలో వడగళ్లకు నష్టపోయిన వరి పంటను ఏడీ గిరిబాబుకు చూపుతున్న రైతులు (ఫైల్)



గుండ్రాంపల్లిలో నేలరాలిన నిమ్మకాయలు (ఫైల్)

చిట్యాల : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే దశలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో చిట్యాల మండలంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో మార్చి నెలలో ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వర్షానికి వందలాది ఎకరాల్లో పంట నష్టం వచ్చింది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేశారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు పదివేల రూపాయల పంట నష్ట పరిహారం నేటి వరకు రైతులకు అందలేదు.

పంట నష్టం ఇలా..

చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, వెలిమినేడు, సుంకెనెపల్లి, గుండ్రాంపల్లి గ్రామాల్లో గత మార్చి నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి పొట్టదశలో ఉన్న 570 ఎకరాల వరి చేలకు తీవ్ర నష్టం జరిగింది. వెలిమినేడు గ్రామంలో 200 ఎకరాలు, పెద్దకాపర్తి గ్రామంలో 150 ఎకరాలు, సుంకెనెపల్లి గ్రామంలో 120 ఎకరాలు, గుండ్రాంపల్లి గ్రామంలో 100 ఎకరాల్లో పొట్ట దశలో ఉన్న వరి చేలు దెబ్బతిన్నాయి. పంట పొలాల్లో ధాన్యం గింజలు నేలరాలాయి. దీంతో రైతులకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది.

249 ఎకరాల్లో పండ్ల, కూరగాయల పంటలకు నష్టం..

చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో మార్చి నెలలో వడగళ్ల వర్షానికి 85 ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. గుండ్రాంపల్లి, నేరడ, వెలిమినేడు, సుంకెనెపల్లి, చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాల్లో 80 ఎకరాల్లో నిమ్మ, 32 ఎకరాల్లోని మామిడి, 50 ఎకరాల్లో కూరగాయల పంటలు, వెంబావి గ్రామంలో రెండు ఎకరాల్లో బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లింది.

పంట నష్టంపై సర్వే..

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు సర్వే నిర్వహించి పంట నష్టం నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నష్టపోయిన వరి పంటకు ఎకరాకు పది వేల రూపాయల పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సంబంధిత శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం నివేదికను రూపొందించి జిల్లా అధికారులకు అందజేశారు. అయినప్పటికీ నేటి వరకు పంట నష్ట పరిహారం రైతులకు అందలేదు. పంట నష్టపరిహారం అందిస్తే వానాకాలం పంటల సాగు పెట్టుబడులకు ఉపయోగకరంగా ఉంటుందని బాధిత రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తీవ్ర నష్టం వచ్చింది



మా వెలిమినేడు గ్రామంలో మార్చి నెలలో వడగళ్ల వర్షం కురిసింది. దీంతో వరి పంటలకు తీవ్ర నష్టం వచ్చింది. నాకున్న ఐదెకరాల్లో వడగళ్ల వానకు సుమారు మూడున్నర ఎకరాల్లో వరి చేనుకు నష్టం వాటిల్లింది. అధికారులు పరిశీలించి, వివరాలు సేకరించారు. కాని నేటి వరకు నష్ట పరిహారం అందలేదు.

– కర్నాటి అంజిరెడ్డి, రైతు, వెలిమినేడు

నివేదిక అందించాం



చిట్యాల మండలంలో మార్చి నెలలో వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటల సర్వే చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. నివేదిక ఆధారంగా పరిహారాన్ని పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వం జమ చేస్తుంది.

– పగిడిమర్రి గిరిబాబు, చిట్యాల మండల వ్యవసాయాధికారి

అపర భగీరథుడు సీఎం కేసీఆర్



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

కనగల్ : రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి నీరు అందిస్తున్న సీఎం కేసీఆర్ అపర భగీరథుడు అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామంలో యాభై లక్షల వ్యయంతో నిర్మించనున్న మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్యాంకు నిర్మాణంతో గ్రామంతోపాటు ఆలయం వద్ద నీటి కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరీం పాషా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి సర్పంచ్‌లు అల్లుబెల్లి పూలమ్మ, అంజమ్మరామచంద్రు ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, బీఆర్‌ఎస్ నాయకులు అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నల్లబోతు యాదగిరి, జినుకుంట్ల అంజయ్య, నర్సింహ, శ్రీశైలం, రాంబాబు, అరెకంటి నర్సింహ, బైరి నగేష్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



నకిరేకల్‌లోని 5వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్‌లోని 5వ వార్డులో మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో సీసీరోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అనంతరం నిరుపేద కుటుంబాలకు చెందిన కొలను ప్రియాంకకు ల్యాప్‌టాప్ కొనిస్తానని, బీ ఫార్మసీ చదువుతున్న సుంకి మానసకు ఒక సంవత్సరం కళాశాల ఫీజు కడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు సోమా యాదగిరి, మట్టిపల్లి వీరు, మురారిశెట్టి కృష్ణమూర్తి, నడికుడి వెంకటేశ్వర్లు, గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న, పెండెం సదానందం ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునుగోడు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు అందించిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరిస్తూ జూన్ 2 నుంచి నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ చైర్మన్ నారబోయిన స్వరూపరాణిరవి, ఎంపీపీ కర్నాటి స్వామి కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిందని, ఆ అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఏడీఏ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

చిట్యాల : మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జూన్ 1 నుంచి 30 రోజుల పాటు గ్రామగ్రామాన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ప్రజల్లోకి తీసుకెళతామని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. చిట్యాలలో మంగళవారం జరిగిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఝెండల లక్ష్మీనారాయణ, చింతల రామచంద్రారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చింతల రామచంద్రారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ అవినీతి రహిత పాలనపై సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి రెడ్డి, భువనగిరి పార్లమెంట్ పార్టీ కన్వీనర్ బందారపు లింగస్వామి, జాయింట్ కన్వీనర్లు కొంతం శ్రీనివాస్, నారాయణ యాదవ్, నకిరేకల్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ మైల నర్సింహ, నియోజకవర్గ జన్ సంపర్క్ అభియాన్ ఇన్‌చార్జ్ శేపూరి రవీందర్, చిట్యాల పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్ పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ విమర్శించారు. మంగళవారం చిట్యాలలో మహాజన్ సంపర్క్ అభియాన్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌కు సంబంధించిన 28 మంది బంధువులు ప్రజాప్రతినిధులుగా, అనధికారిక పదవుల్లో ఉంటూ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ బందారపు లింగస్వామి, జాయింట్ కన్వీనర్లు కొంతం శ్రీనివాస్, నారాయణ యాదవ్, నకిరేకల్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ మైల నర్సింహ, నియోజకవర్గ మహాజన్ సంపర్క్ అభియాన్ ఇన్‌చార్జ్ శేపూరి రవీందర్, చిట్యాల పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ఆర్థిక చేయూతనందించాలి

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నట్లుగానే, ఆర్యవైశ్యుల్లో పేదల కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించేలా పథకాన్ని రూపొందించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆర్థిక చేయూతనందిస్తే చిరు వ్యాపారాలు నిర్వహించుకుని కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని అన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై నేడు సమావేశం

మర్రిగూడ : దశాబ్ది ఉత్సవాలపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి మొదలై 22 వరకు కొనసాగుతాయని తెలిపారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



నల్లగొండలో మాట్లాడుతున్న సలీం

నల్లగొండ టౌన్ : ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అవురేశి మారయ్య, రవి, నాగరాజు, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

తిప్పర్తి మండలంలో..

రామగిరి(నల్లగొండ) : సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భీమగాని గణేశ్, నాయకులు మంత్రాల మంగమ్మ, లెంకల వసంత, కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, నరాల వెంకన్న, నాగరాజు, రమణ, స్రవంతి, సంధ్య, సామ్రాజ్యం, సునిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న పిల్లి రామరాజు



ఆలయం వద్ద గుత్తా అమిత్‌రెడ్డి..

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు, గుత్తా మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మంగళవారం వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, అయితగోని స్వామిగౌడ్, వెంకటేశ్వర్‌రావు, పిల్లి కృష్ణంరాజు, సుధాకర్‌రెడ్డి, జినుకుంట్ల జయశంకర్‌గౌడ్, జినుకుంట్ల రాములు, రవీందర్ రెడ్డి, జానీ, శంకర్, కృష్ణ, సత్తి పాల్గొన్నారు.

వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



మునుగోడు : కొంపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరేష్



మర్రిగూడ : యరగండ్లపల్లి కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

మునుగోడు : మండల వ్యాప్తంగా మంగళవారం వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో వర్షం నీరు నిలిచి ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేశారు. మండలంలో మొత్తం 11 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయగా నాలుగు కేంద్రాల్లో దాదాపు 80 మంది రైతుల ధాన్యం తడిసి పోయింది. కొంపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి, సిబ్బంది ఉన్నారు.

మర్రిగూడ : శివన్నగూడ, మర్రిగూడ గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో యరగండ్లపల్లి, కుదబాక్షపల్లి, నామాపురం గ్రామాల్లో సబ్ సెంటర్లను గత నెల 19న ఏర్పాటు చేశారు. రైతులు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకొచ్చినప్పటికీ హమాలీ, లారీల కొరతతో ధాన్యం రాశుల వద్ద నెలల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దయింది. యరగండ్లపల్లి, శివన్నగూడ కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లు పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మాడం శాంతమ్మవెంకటయ్య, చిట్యాల సబితాయాదగిరిరెడ్డి, సిబ్బంది మల్లికార్జున్, మధు, వెంకటేష్‌లు ఉన్నారు.

కట్టంగూర్ : కట్టంగూర్ మండలంలో మంగళవారం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయం అయ్యాయి. మండలంలోని ఈదులూరు పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం స్వల్పంగా తడవగా కురుమర్తి ఐకేపీ కేంద్రంలో కాంటా వేసిన 400 బస్తాలు తడిసి ముద్దయ్యాయి.

శాలిగౌరారం : మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న 24 వేల క్వింటాళ్ల ధాన్యం రాశులు అడుగు భాగంలో తడిసిపోయాయి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో తిరుమలరాయుని గూడెం, మాధారంకలాన్ కేంద్రాల్లో 9 వేల క్వింటాళ్ల ధాన్యం, ఐకేపీ ఆధ్వర్యంలోని ఆకారం, చిత్తలూరు, భైరవునిబండ, గురుజాల, రామాంజాపురం, రామగిరి కేంద్రాల్లో నిల్వ ఉన్న 15 వేల క్వింటాళ్ల ధాన్యం తడిసింది.



కట్టంగూర్ : కురుమర్తి ఐకేపీ కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



శాలిగౌరారం : ఆకారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

జూన్ 3 నుంచి బడిబాట

మర్రిగూడ : జూన్ 3 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభమై 17వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంఈఓ గురువారావు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ 3 నుంచి 17వ తేదీ వరకు ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మూడేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చొరవ చూపాలన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం విద్యపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఉద్యోగం సాధించిన వారికి సన్మానం

నల్లగొండ : ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించిన యువతీ యువకులను రామయ్య డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాగర్ రోడ్డులోగల డాన్‌బాస్కో క్యాంపస్‌లో డైరెక్టర్ శ్రీనివాస్, రామయ్య సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్నిపథ్ స్కీంలో 2023 మొదటి బ్యాచ్‌లో రామయ్య డిఫెన్స్ అకాడమీలో డిగ్రీతో పాటు డిఫెన్స్ కోర్సులో చేరి ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్‌లో భూమిక, పూజ, రోజా, శివసాయిలు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.



సన్మానిస్తున్న అకాడమీ నిర్వాహకులు

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న భక్తులు

నకిరేకల్ : పట్టణంలోని పన్నాలగూడెంలో పెద్ద చెరువు వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి ఉత్సవ మూర్తుల విగ్రహాలను పట్టణ వీధుల గుండా ఊరేగించారు. హోమాలు, ప్రతిష్ఠమూర్తులకు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

నల్లగొండ క్రైం : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి కోర్టు జైలు శిక్ష, మరికొందరికి జరిమానా విధించినట్లు నల్లగొండ ట్రాఫిక్ సీఐ చీర్ల శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా గుర్తించామని, 15 మందిలో ముగ్గురికి పదిహేను రోజులు, ఇద్దరికి రెండు రోజుల జైలు, మరికొందరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న వల్లభాపురం గ్రామస్తులు

నకిరేకల్ : మండలంలోని వల్లభాపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌పై దాడిచేసి గాయపరిచిన నోముల గ్రామానికి చెందిన పెట్రోల్ బంక్ సిబ్బందిని అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం వల్లభాపురం గ్రామస్తులు పెట్రోల్ బంక్ ఎదుట, నకిరేకల్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ నెల 27న వల్లభాపురం గ్రామానికి చెందిన ప్రసాద్.. నోముల పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకునే క్రమంలో పెట్రోల్ బంక్ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో ప్రసాద్ తలకు గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి కారణమైన వారిని పోలీసులు అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారని ప్రసాద్ బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

'ఆర్‌బీఎస్‌కే'కు వైద్యుల కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ : గత నెల 14వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'నెరవేరని ప్రభుత్వ లక్ష్యం'కథనానికి వైద్యాధికారులు స్పందించారు. కంటి వెలుగులో పాల్గొన్న వైద్యులు తిరిగి ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల్య స్వాస్థ్య కార్యక్రమం) వైద్య సేవలు అందించేందుకు వచ్చారు. బీ-టీంలో ఒకరు వెటర్నరీ లీవ్, మరొకరు అనారోగ్యంతో సెలవులో ఉన్నప్పటికీ ఎ-టీంలోని స్త్రీ వైద్యురాలిని సోమవారం నుంచి బీ-టీంకు కేటాయించారు. టీం సభ్యులు ముందస్తుగా అంగన్‌వాడీ కేంద్రాలకు సమాచారం అందించి వివరాలు తెలుసుకుని వైద్య సేవలు అందిస్తారని వైద్యుడు దీపక్ తెలిపారు.

కరాటే బెల్టులు అందజేత

నల్లగొండ టూటౌన్ : కరాటే నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఆపద సమయంలో తనను తాను రక్షించుకోవచ్చని నల్లగొండ టూటౌన్ సీఐ నాగదుర్గ ప్రసాద్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమిలో జపాన్ కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్య స్థాయి నుంచే కరాటే నేర్చుకోవాలని, శారీరక దేహ ధారుడ్యంతో పాటు పేరు ప్రఖ్యాతలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ మాస్టర్, ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమి డైరెక్టర్ శ్రీధర్ సాగర్, నగేష్, వంశీ, పవన్, నిఖిల్, అఖిల్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో టూటౌన్ సీఐ నాగదుర్గప్రసాద్